క్లుప్తంగా

పంట నష్టం జాబితా ప్రదర్శన



కొవ్వలి ఆర్‌బీకేలో పంట నష్టం జాబితా ప్రదర్శన

దెందులూరు: మండలంలో అన్ని రైతుభరోసా కేంద్రాల్లో పంట నష్టం జాబితాను ప్రదర్శిస్తున్నట్టు దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గడ్డె రమేష్ అన్నారు. మంగళవారం దెందులూరు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పంట నష్టం జాబితాను ఆయన ప్రదర్శించారు. 1,581 మంది రైతులకు 2,600 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని నివేదికను ప్రభుత్వానికి అందజేశామని రమేష్ వివరించారు.

వేలం వద్దని ధర్నా

గణపవరం: గణపవరం మండలం జల్లికాకినాడలోని చెరువులోని చేపల పట్టుబడికి వేలం పాట నిర్వహించవద్దని స్థానికులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. ముందుగా వేలం నిర్వహించాలని గ్రామ పంచాయతీ నిర్ణయించింది. మంగళవారం గ్రామస్తులు చెరువు వద్దకు వచ్చి ఆందోళన నిర్వహించారు.

నీటి సమస్యకు పరిష్కారం

భీమడోలు: ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించడమే జల్ జీవన్‌మిషన్ లక్ష్యమని పూళ్ల సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ అన్నారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురానికి జల్ జీవన్‌మిషన్ పథకంలో రూ.20 లక్షలు మంజూరయ్యాయి. దీనిలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేయనున్న మైక్రో ఫిల్టర్ నిర్మాణ పనులకు మంగళవారం సర్పంచ్ శంకుస్థాపన చేసారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కృషి కారణంగాజల్ జీవన్ మిషన్ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పథకంలో గ్రామంలోని 130 కుటుంబాలకు ఉచితంగా మంచి నీటి కుళాయిలను అందించేందుకు అవకాశముంటుందన్నారు. గ్రామంలోని ప్రధాన పైపు లైన్ల నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి హరిబ్రహ్మనాయుడు, వార్డు సభ్యుడు జగన్‌మోహన్‌రావు, ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పులిచర్ల వెంకట కృష్ణారావు, మాజీ ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి వెంకన్న, వార్డు సభ్యులు, నాయకులు తాడి సుబ్బిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

పెదవేగి : విద్యార్థుల ఇబ్బందిని వివరించగా వెంటనే స్పందించిన తీరుపై విద్యుత్‌శాఖ అధికారులకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేశారు. విజయరాయి మండల ప్రాథమిక పాఠశాల వద్ద తుప్పు పట్టిన ఇనుప విద్యుత్ స్తంభం కారణంగా చిన్న పిల్లలకు ప్రమాదకారిగా ఉందని ఎంఈవో అరుణ్ కుమార్ చెప్పగానే స్పందించిన విద్యుత్ ఏడీ శ్రీనివాసరావు 12 గంటల వ్యవధిలోనే పాత ఇనుప స్తంభాన్ని తొలగించి నూతన స్తంభం ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు.

విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడిగా బ్రహ్మం

ఉంగుటూరు: విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా ఉంటే రాజకీయ అవకాశాలు అందుకోవచ్చని సంఘం అధ్యక్షుడు అనుపోజు వీర బ్రహ్మం అన్నారు. సమావేశంలో నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనుపోజు బ్రహ్మం, ఉపాధ్యక్షుడిగా యర్రోజు సుబ్బయ్యాచార్యులు, గౌరవ అధ్యక్షుడిగా కవులూరి అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా నెల్లూరి రామపండు, కోశాధికారిగా పుల్లూరి సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంటుగా ఆరిపాక వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా బి. శ్రీనివాసాచార్యులు, కార్యనిర్వహణ కార్యదర్శిగా నిడదవోలు శ్యామ్, డైరెక్టరుగా గురజాపు సురేష్, సభ్యులను ఎన్నుకున్నారు.

పీఎంపీలు సేవాదృక్పథంతో పని చేయాలి

భీమడోలు: ఏలూరులో ఈనెల 27వ తేదీన పీఎంపీ అసోసియేషన్ 61వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పీఎంపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.జయరామ్ అన్నారు. భీమడోలులో పీఎంపీ అసోసియేషన్ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం.జయరామ్ మాట్లాడుతూ గ్రామాల్లో పీఎంపీలు సేవాదృక్పథంతో పని చేసి గుర్తింపు పొందాలన్నారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ ఎస్‌కే రంజాన్‌వలి, పీఎంపీలు పాల్గొన్నారు.

కేంద్రం పథకాలపై ప్రచారం

పెదపాడు: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 17రకాల సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్నాయని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పెదపాడు మండలంలోని వడ్డిగూడెం, గుడిపాడులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించి కేంద్రం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. బీజేపీ నాయకులు శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఉంగుటూరు: కోడి పందేలు, గుండాట, పేకాట నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చేబ్రోలు ఎస్సై ఎ. మణికుమార్ తెలిపారు. మంగళవారం చేబ్రోలు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు మండలంలోని ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సహకరించాలని ఆయన కోరారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సుపరిపాలన

భీమడోలు: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ సుపరిపాలనను అందిస్తున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గుండుగొలను సచివాలయం 1 పరిధిలో మంగళవారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బ్రోచర్లను ఆయన అందించారు. పథకాలను అందించే విషయంలో వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది అవినీతికి తావులేకుండా పారదర్శకత పాటించాలని సూచించారు. ప్రజలను స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టం చేసిందన్నారు. కుటుంబానికి అందిస్తున్న వైద్య ఖర్చుల మొత్తాన్ని రూ.25లక్షల



గుండుగొలనులో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

పెంచడం చాలా సంతోషదాయకమన్నారు. నాలుగున్నర ఏళ్ల ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాయని ఆయన అన్నారు. దేశంలో ఎక్కడా లేనటువంటి వలంటీర్, సచివాలయ వ్యవస్థలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసారని అన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఈ వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుడుతున్నాయన్నారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీకి ఘన విజయం అందించాలని కోరారు. అనంతరం పలువురికి కళ్లజోళ్లను అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మగుంట భవాని రంగ, సర్పంచ్ కూర్మా లక్ష్మీరాజ్‌కుమార్, ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల సచివాలయాల కన్వీనర్ మద్దుల రాజా, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జహీర్, ఎంపీటీసీ ఆజామ్, గంటా శ్రీనివాస్, పొల్నాటి శ్రీను, జిల్లా నాయకులు వగ్వాల అచ్యుతరామారావు, నాయకులు నల్ల శ్రీను, నత్తా నరసింహులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

21 నుంచి మండలంలో ఎమ్మెల్యే ప్రజా ఆశీర్వాద యాత్ర

దెందులూరు: దెందులూరు మండలంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఈ నెల 21 నుంచి ప్రజాఆశీర్వాద పాదయాత్ర ప్రారంభమవుతుందని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డినాని తెలిపారు. 21న మధ్యాహ్నం 3 గంటలకు మేధినరావుపాలెంలోకి పాదయాత్ర చేరుకుంటుందని తెలిపారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు శ్రీరామవరంలోకి పాదయాత్ర ప్రవేశిస్తుందని రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుందన్నారు. 22న ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు దెందులూరులో పాదయాత్ర కొనసాగుతుందన్నారు. 11.30 గంటల నుంచి దెందులూరు హైస్కూల్ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం 3 నుంచి రాత్రి 9 గంటల వరకు దెందులూరులో పాదయాత్ర నిర్వహించనున్నట్టు కామిరెడ్డి నాని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సచివాలయ భవనాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

ఉంగుటూరు: గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సచివాలయం, ఆర్‌బీకే భవనాలను నిర్మిస్తోందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. రూ.269.88 లక్షల వ్యయంతో ఉంగుటూరు మండలంలో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయ భవనాలను ఎమ్మెల్యే వాసుబాబు చేతుల మీదుగా బుధవారం ప్రారంభించనున్నారని వారు తెలిపారు. దీనికి సంబంధించి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే వాసుబాబు బుధవారం ఉదయం చిన్న వెల్లమిల్లిలో రూ.43 లక్షలు వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, నాచుగుంటలో రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తారు. ఇదే పంచాయతీ పరిధిలోని కొత్తగూడెంలో రూ.38 లక్షల వ్యయంతో నిర్మించిన వాటర్ ట్యాంకు, పైపులైను పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. నీలాద్రిపురంలో రూ.23.90 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని వాసుబాబు ప్రారంభిస్తారు. ఉంగుటూరులో రూ.23.90 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ. 43 లక్షల వ్యయంతో నిర్మించిన ఉంగుటూరు సచివాలయం- 2 భవనాన్ని, మధ్యాహ్నం శాలివాహన సంఘం భవనాన్ని, రజక సంఘం భవనాన్ని, రూ.23.90 లక్షల వ్యయంతో నిర్మించిన ఆరోగ్యకేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే వాసుబాబు ప్రారంభిస్తారు.



ఉంగుటూరులోని సచివాలయం- 2 భవనం



నాచుగుంటలో నూతన సచివాలయ భవనం

అంగన్‌వాడీ సేవలకు ఆటంకం లేదు

భీమడోలు: సమ్మె వల్ల అంగన్‌వాడీ సేవలకు ఎటువంటి ఆటంకం లేదని జిల్లా ఐసీడీఎస్ పీడీ కేఏవీఎల్ పద్మావతి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు మూత పడకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖల అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసారు. దీనితో కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం, ప్రీస్కూల్ విద్యకు ఆటంకం లేకుండా సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా మహిళలను నియమించారు. ఈ నేపథ్యంలో పూళ్ల, కురెళ్లగూడెం, పాతూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను మంగళవారం ఐసీడీఎస్ పీడీ కేఏవీఎల్ పద్మావతి ఆకస్మిక తనిఖీ చేసారు. చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీని, రికార్డులను ఆమె పరిశీలించి ఉద్యోగులకు పలు సూచనలందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి కేంద్రాల నిర్వహణ ప్రారంభించాలన్నారు. కేంద్రాలకు వచ్చే చిన్నారుల వివరాల జాబితాలను సచివాలయ సిబ్బంది, డ్వాక్రా సంఘాలకు అందించామని, వారికి ప్రతి రోజు ఫోన్ చేసి కేంద్రాలకు వచ్చేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో సునీల్ రాజశేఖర్, సూపర్‌వైజర్ షేక్ నూర్జహాన్, వీఆర్వో ఇంతియాఫ్, సచివాలయ కార్యదర్శి గౌతమి పాల్గొన్నారు.



పూళ్లలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఐసీడీఎస్ పీడీ కేఏవీఎల్ పద్మావతి

ఆడపిల్లలపై వివక్ష చూపరాదు

గణపవరం: ఆడపిల్లలపై వివక్ష చూపకుండా వారిని కూడా మగ పిల్లలతో సమానంగా చూడాలని దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి అన్నారు. మంగళవారం గణపవరం పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను ఉన్నతంగా చదివించాలని, వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. ప్రతి రోజూ ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్యవంతులను చేయాలన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ వరకూ ఈకార్యక్రమం కొనసాగుతుందన్నారు. రక్తహీనత లేకుండా గర్భిణులు ఐరన్ మాత్రలు వేసుకోవాలన్నారు. యుక్త వయస్సు ఆడపిల్లలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గణపవరంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి కిరణ్మయి

సెమీ క్రిస్మస్ వేడుకలు



దెందులూరు గౌడవీధిలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: మండలంలో గ్రామగ్రామాన సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి దెందులూరులో సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా స్మాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్ మేజర్ కాటి రమణయ్య, కే.సువర్ణబాయి ఆధ్వర్యంలో సంఘ పెద్దలు, చిన్నారులు, గృహసమితి సభ్యులు సెమీ క్రిస్మస్ నిర్వహించారు. సెమీక్రిస్మస్ పాటలతో అలరించారు. శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులు ఇంటింటా సందడి చేశారు.

వైఎస్సార్ సీపీ పాలనకు ప్రజల మద్దతు

ఉంగుటూరు: పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం వెల్లమెల్లి గ్రామ పంచాయతీ పరిధిలో చిన్నవేలమిల్లి సచివాలయం పరిధిలో మంగళవారం వైఎస్సార్ సీపీ నిర్వహించారు. తొలుత చెనగలమిల్లి సచివాలయం పరిధిలో సుమారు రూ.25 కోట్లతో సంక్షేమానికి సంబంధించిన డిస్‌ప్లే బోర్డును, గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఉంగుటూరు మండల కన్వీనర్ మరడా వెంకట మంగారావు మాట్లాడుతూ చిన్నవెల్లిమిల్లి పరిధిలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. అనంతరం బాబూ జగ్జీవన్, అంబేడ్కర్, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ మద్దతు తెలుపుతున్నారని మంగారావు అన్నారు. మళ్లీ జగనన్నకే ఓట్లు వేస్తామని, జగనన్నే అధికారంలోకి రావాలి ప్రజలు స్వచ్ఛందంగా పేర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, వి.కుమార్‌రాజు, మల్లారెడ్డి శేషగిరిరావు, వీరాబత్తుల నాగేశ్వరరావు, రాపోలు పెద్దిరాజు, పులపాక వెంకట దుర్గారావు పాల్గొన్నారు.



చిన్నవేలమిల్లి సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన నాయకులు

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

భీమడోలు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా కృషి చేస్తున్నాయని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా, ఎంపీటీసీ అంబటి దేవి ప్రసాద్ అన్నారు. పోలసానిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ఆరోగ్య సంరక్షణ పథకం హెల్త్ కార్డులను ప్రజలకు అందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.ఐదు లక్షలు వైద్య కోసం ఖర్చుపెడుతుందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకంలో రూ.25లక్షల వరకు వైద్య ఖర్చు పెంచారని తెలిపారు. గ్రామంలో 1,248 హెల్త్ కార్డులను పంపిణీ చేసారు. గ్రామంలోని రెండో వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనను అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల లబ్ధి ప్రజలందరి చెంతకు తీసుకుని వెళ్లిన ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోట శ్రీనివాసరావు, డిజిటల్ అసిస్టెంట్ రాణా, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హెల్త్‌కార్డులను లబ్ధిదారులకు అందిస్తున్న సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా, ఎంపీటీసీ అంబటి దేవీ ప్రసాద్

3,200 మందికి ఉజ్వల లబ్ధి

నిడమర్రు: ఉంగుటూరు నియోజకవర్గంలో ఉజ్వల యోజన పథకంలో ఇప్పటి వరకూ 3,200 మంది పేదలకు కేంద్రం ఉచిత గ్యాస్ కనెక్షన్ అందించినట్లు బీజేపీ ఉంగుటూరు కన్వీనర్ శరణాల మాలతీరాణి అన్నారు. మంగళవారం మండలపర్రులో వికసిత భారత్ సంకల్పయాత్రను ఆమె ప్రారంభించారు. మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంపై అవగాహన సదస్సు

పెదపాడు: దేశంలోనే విద్యుత్ ఆదా చేయడంలో మన రాష్ట్రం 2వ స్థానంలో నిలిచిందని విద్యుత్ శాఖ ఎస్ఈ పీ సాల్మన్‌రాజు నిలిచిందన్నారు. విద్యుత్ ఆదా చేయడం, వినియోగంపై పెదపాడు మండలంలోని వట్లూరులో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎస్ఈ పీ సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యుత్ ఆదాకు విద్యార్థులు సహకరించాలని కోరారు. విద్యుత్ ఆదా అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు కలెక్టరు చేతులమీదుగా బహుమతులు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నటరాజన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ త్రివాస్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై రాంబాబు, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి మేట్లకు శిక్షణ

దెందులూరు: ఉపాధి హామీ పథకంలో మేట్ల పాత్ర కీలకమని మండల ఏపీఓ దశరథరామ్‌జీ అన్నారు. మంగళవారం దెందులూరు రైతుభరోసా కేంద్రం ఎదుట కొలతలపై 50 మంది మేట్లకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మేట్లు కొలతలు తీసుకునేటప్పుడు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పర్యవేక్షించాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ శ్రావణ్, మేట్లు ఉన్నారు.

భీమడోలులో మేట్లకు శిక్షణ

భీమడోలు: జాతీయ ఉపాధి హామీ పథకం పనులను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు సమావేశ మందిరంలో మంగళవారం ఉపాధి హామీ పథకం మేట్ల రెండో విడత శిక్షణ తరగతులను నిర్వహించారు. ఏపీవో కె.పద్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి హాజరయ్యారు. రిసోర్స్ పర్సన్లుగా ఉంగుటూరు ఏపీవో సీహెచ్ మల్లేశ్వరరావు, సిరిపల్లి సతీష్ శిక్షణనిచ్చారు.

యువత ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఉంగుటూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ శాతం పెంచే దిశగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని జిల్లా స్వీప్ నోడల్ అధికారి, హౌసింగ్ పీడీ కె రవికుమార్ చెప్పారు. ఏలూరు ఆర్డీవో ఖజావలి అధ్యక్షతన మంగళవారం ఉంగుటూరు మండలం నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో 'ఎలక్టరల్ లిటరసీ క్లబ్' నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యువత ఓటు హక్కు వినియోగానికి ముందుకురావాలని కోరారు. తహసీల్దార్ కె.వి.రమణారావు, డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు, వీఆర్వో సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

అసైన్డ్ భూసమస్యకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- పెదవేగిలో 115 మంది రైతులకు రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ
- ప్రజా ఆశీర్వాద యాత్రకు జననీరాజనాలు



అసైన్డ్ భూముల రైతులకు రిజిస్ట్రేషన్ పట్టాలు అందించి వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : రాబోయే ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గం నుంచి 50 వేలకు పైగా మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ధీమా వ్యక్తం చేశారు. పెదవేగి తురాయి చెట్టు వద్ద నుంచి ప్రారంభమైన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి 6వ రోజు ప్రజా ఆశీర్వాద యాత్రకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. పెదవేగి తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామంలోని అర్హులైన 115 మంది లబ్ధిదారులకు అసైన్డ్ భూములకు సంబంధించి పట్టాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపిన గౌరవ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. న్యాయంపల్లిలో రూ.43.60 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కూచింపూడి చేరుకుని ప్రాథమిక పాఠశాలలో రూ.18.50 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను, నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. రామశింగవరం చేరుకుని అక్కడ పార్టీ జెండా ఎగురవేసి స్థానిక నాయకులను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. పాదయాత్రగా తాళ్ళగోకవరం బస ప్రాంతానికి చేరుకుని రాత్రి అక్కడే పల్లె నిద్ర చేయనున్నారు.

250 మంది రైతులకు భూముల రిజిస్ట్రేషన్ పట్టాలు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ 1977 నుంచి అసైన్డ్ భూములున్న రైతులు ఎటువంటి హక్కులు లేకుండా వాటిని సాగు చేస్తూ ఇబ్బంది పడేవారన్నారు. 50 ఏళ్ల నాటి సమస్యకు సీఎం జగన్ చరిత్రాత్మక పరిష్కారం చూపారని అన్నారు. అసైన్డ్ భూముల ధరలు ఇప్పటి వరకూ రూ.10 నుంచి రూ.15 లక్షలున్నాయని, నేడు రిజిస్ట్రేషన్ భూములగా మారిన తరువాత వాటి విలువ రూ.42 నుంచి రూ.45 లక్షలకు చేరిందన్నారు. నిన్న బాపిరాజు గూడెంలో దాదాపు 250 మంది రైతులకు భూముల రిజిస్ట్రేషన్ పట్టాలను అందించామన్నారు. పెదవేగిలో 115 మంది ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఓసీ రైతులకు 150 ఎకరాల భూములకు సంబంధించి పట్టాలు అందించామని ఎమ్మెల్యే చెప్పారు. నియోజక వర్గంలో అర్హులైన ప్రతి అక్క చెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి 2024లో నిర్వహించనున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గ ప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్య, ఏపీ ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షుడు, పార్టీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజాఆశీర్వాద యాత్రకు దెందులూరు నాయకులు

దెందులూరు: పెదవేగి మండలంలో ప్రజాఆశీర్వాద పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి సంఘీభావంగా మంగళవారం దెందులూరు మండలం నుంచి గ్రామగ్రామాన వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలివెళ్లారు. యాత్రకు మద్దతుగా ఎమ్మెల్యేకు సంఘీభావం తెలియజేసి ఆయన వెంట నడిచారు. ఈ నెల 21 నుంచి దెందులూరు మండలంలో ప్రజాఆశీర్వాదపాదయాత్ర వస్తున్న సందర్భంగా ఎమ్మెల్యేను రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కలిశారు.